క్లుప్తంగా

ఎన్నికల నియమావళిని తప్పక పాటించాలి



మాట్లాడుతున్న కోవూరు ఆర్వో, జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్

కోవూరు : ఎన్నికల నియమావళిని అన్ని రాజకీయ పార్టీల నాయకులు తప్పక పాటించాలని కోవూరు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ తెలిపారు. కోవూరులోని ఆర్వో కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులతో ప్రత్యేక సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిబంధనలను రాజకీయ పార్టీలు పూర్తిస్థాయిలో అవగాహన చేసుకుని సహకరించాలన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో ఫ్లయింగ్ స్క్వాడ్, ఎంసీసీ, స్వీప్ బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో ఎక్కువ మొత్తంలో నగదును తరలించరాదన్నారు. అదేవిధంగా రాజకీయ పార్టీల నాయకులు సభలు, ర్యాలీలతో పాటు ఎన్నికల ప్రచారం నిర్వహించాలంటే తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలన్నారు. ఈఆర్వో, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసులు, కోవూరు తహసీల్దార్ విజయశ్రీ, ఇందుకూరుపేట తహసీల్దార్ జి.రమేష్, బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ కమిషనర్ రమణబాబు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటు కీలకం

కోవూరు : ప్రజాస్వామ్య దేశాల్లో ఓటు అత్యంత కీలకమని, దీనిని దృష్టిలో పెట్టుకుని యువత ఓటింగ్‌లో పాల్గొనాలని స్వీప్ నోడల్ ఆఫీసర్ పీవీ రత్నం పేర్కొన్నారు. కోవూరు మండలం పడుగుపాడు పంచాయతీ నేతాజీ నగర్‌లో ఉన్న వైకేఆర్ అండ్ కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఓటు హక్కు ఇతర అంశాలపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటు నమోదు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. అనంతరం ఓటుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏపీఎం ఎస్. రవిశంకర్‌రెడ్డి, సీఆర్పీ మల్లేశ్వర్‌రెడ్డి, సీసీ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చెక్‌పోస్టుల్లో అప్రమత్తంగా ఉండాలి

వరికుంటపాడు: త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని మద్యం, డబ్బు తదితరాలు రవాణా కాకుండా నియంత్రించేందుకు జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల్లోని సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ తిరుమలేశ్వర్‌రెడ్డి చెప్పారు. ఆయన మంగళవారం వరికుంటపాడు పోలీసుస్టేషన్‌ను తనిఖీ చేసిన అనంతరం సరిహద్దులో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును పరిశీలించి సిబ్బందికి సూచనలు, సలహాలు అందించారు. ప్రతి వాహనాన్ని తనిఖీ చేసి వివరాలు రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. అనంతరం మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 18 చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. 26 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేసి తనిఖీలు ముమ్మరం చేశామన్నారు. ఇప్పటికే వాహన తనిఖీల్లో చెక్‌పోస్టుల వద్ద నగదు, మద్యం స్వాధీనం చేసుకున్నామన్నారు. సిబ్బంది నిష్పక్ష పాతంగా వ్యవహరించాలన్నారు. ఆయన వెంట డీఎస్పీ వెంకటరమణ, సీఐ గిరిబాబు, ఎస్సై తిరుపతయ్య ఉన్నారు.

మర్రిపాడు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా సరిహద్దు చెక్‌పోస్టును ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి మంగళవారం తనిఖీ చేశారు. చెక్‌పోస్టు నుంచి వెళ్తున్న ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ నిర్వహించాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా 18 చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని, ఇప్పటి వరకు రూ.10 కోట్ల వరకు అక్రమ నగదు పట్టుకున్నట్లు తెలిపారు. ప్రతి చెక్‌పోస్టు వద్ద ఎస్సై స్థాయి అధికారి పర్యవేక్షణ ఉంటుందన్నారు. సిబ్బంది చెక్‌పోస్టుల వద్ద అప్రమత్తంగా ఉండాలని, ఎన్నికల నిబంధనల మేరకు విధులు నిర్వహించాలని సూచించారు. ఆయన వెంట ఆత్మకూరు సీఐ జీ వేణు, మర్రిపాడు ఎస్సై విశ్వనాథ్‌రెడ్డి ఉన్నారు.

మతిస్థిమితం లేని యువకుడి హల్‌చల్

ఉదయగిరి: పట్టణానికి చెందిన ఓ యువకుడు మతిస్థిమితం సరిగా లేకపోవడంతో పలువురిపై దాడి చేసిన ఘటన మంగళవారం పంచాయతీ బస్టాండ్ సమీపంలో జరిగింది. అతను వీధుల్లో నగ్నంగా తిరుగుతూ కనిపించిన వారిని కొట్టడం, బిగ్గరగా అరవడం చేస్తుండడంతో పలువురు వారించేందుకు ప్రయత్నించగా వారిపై దాడి చేశాడు. దీంతో ఎట్టకేలకు యువకులు అతన్ని పట్టుకుని దేహశుద్ధి చేసి బంధించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.

బైక్ అదుపుతప్పి గాయాలు

సోమశిల: బైక్ అదుపు తప్పి పడి ఓ వ్యక్తి గాయపడ్డాడు. ఈ ఘటన అనంతసాగరం మండలం పడమటికంభంపాడు ఇసుక రీచ్ సమీపంలో మంగళవారం జరిగింది. తమిళనాడు రాష్ట్రానికి చెందిన మణి వరికోత యంత్రం వద్ద ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. పనిపై బైక్‌లో వెళ్తుండగా అదుపు తప్పి గాయపడ్డారన్నారు. ఎస్సై సుబ్బారావు ఘటనా స్థలానికి చేరుకుని ప్రథమ చికిత్స చేయించి అనంతరం 108 వాహనంలో ఆత్మకూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

వైఎస్సార్‌సీపీలో సముచిత స్థానం



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి

- పార్టీ నెల్లూరు రూరల్ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి
- పార్టీలో భారీగా చేరికలు

నెల్లూరు సిటీ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ సముచిత స్థానాన్ని కల్పించి.. అన్ని విధాలా అండగా ఉంటామని పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 200 మంది ఆయన సమక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో మంగళవారం చేరారు. నగరంలోని తన నివాసంలో నిర్వహించిన కార్యక్రమంలో వీరికి పార్టీ కండువాలను కప్పి ఆదాల సాదరంగా ఆహ్వానించారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి వేలూరు శివసునీల్‌రెడ్డి, నేతలు పాట్లూరు జయవర్ధన్, రాచర్ల వెంకటకుమార్, గుంటక వంశీ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరికలంటూ డ్రామాలు

నియోజకవర్గంలో పలువురు టీడీపీలో చేరుతున్నారంటూ కోటంరెడ్డి సోదరులు డ్రామాలకు తెరలేపారని 34వ డివిజన్‌కు చెందిన నసీర్ విమర్శించారు. నసీర్ తన మిత్ర బృందంతో కలిసి ఆదాల ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా నసీర్ మాట్లాడారు. స్నేహబంధం పేరుతో కొందర్ని.. రాజకీయాలపై అవగాహన లేని మరికొందరు అమాయకులను పార్టీ కార్యాలయానికి పిలిపించి వారికి టీడీపీ కండువాలను ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి బలవంతంగా వేస్తున్నారని ఆరోపించారు. సీఏఏపై మాట్లాడాలంటూ తనను కార్యాలయానికి ఆహ్వానించి.. టీడీపీ కండువా కప్పి పార్టీలో చేరానని కోటంరెడ్డి ప్రకటించారని ఆరోపించారు. తాను టీడీపీలో చేరలేదని, ఆదాల ప్రభాకర్‌రెడ్డి విజయానికి కృషి చేస్తానని ప్రకటించారు. విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, రియాజ్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి వేలూరు శివసునీల్‌రెడ్డి, దారా వంశీ తదితరులు పాల్గొన్నారు.

- రూరల్ పరిధిలోని 29వ డివిజన్ జనసేన ఇన్‌చార్జి శశికాంత్, 200 మంది కార్యకర్తలు ఆదాల ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. సురేష్, చలపతి, ఉదయ్, సాయి, చంద్రమ్మ తదితరులు పార్టీలో చేరారు. మేయర్ స్రవంతి, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, ప్రముఖ న్యాయవాది మలిరెడ్డి కోటారెడ్డి, ఏఎంసీ చైర్మన్ కోటేశ్వరరెడ్డి, వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మాళెం సుధీర్‌కుమార్‌రెడ్డి, చెన్నారెడ్డి నవీన్‌కుమార్‌రెడ్డి, సుబ్బారెడ్డి, కమల్, ఆదిరెడ్డి, నూరి బాబు తదితరులు పాల్గొన్నారు.





పార్టీలో చేరిన వారితో ఆదాల

ఆత్మీయ భేటీ



చంద్రారెడ్డిని కలిసిన విజయసాయిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, ఖలీల్ అహ్మద్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): సీపీఎం సీనియర్ నేత చంద్రారెడ్డితో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు పార్లమెంట్, నెల్లూరు సిటీ అభ్యర్థులు విజయసాయిరెడ్డి, ఖలీల్ అహ్మద్, పార్టీ జిల్లా అధ్యక్షుడు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మంగళవారం భేటీ అయ్యారు. శాంతినగర్‌లోని చంద్రారెడ్డి నివాసంలో కలిసి మద్దతు కోరారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడారు. పేదల పక్షాన పోరాడిన నేతగా చంద్రారెడ్డి ఈ ప్రాంతానికి సుపరిచితులని చెప్పారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలతో పేదల జీవితాల్లో మార్పొచ్చిందని చంద్రారెడ్డి తమతో చెప్పారని, ఈ మేరకు ఆయన మద్దతు తప్పక లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఆదాలకు మద్దతుగా ప్రచారం



కరపత్రాలను అందజేస్తున్న పెంచలరెడ్డి

నెల్లూరు సిటీ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డికి మద్దతుగా 27వ డివిజన్లోని చంద్రమౌళీనగర్ ఐదు, ఆరు వీధులు, సావిత్రినగర్‌లోని 7, 8వ వీధుల్లో ఎన్నికల ప్రచారాన్ని పార్టీ నగరాధ్యక్షుడు నన్నపురెడ్డి పెంచలరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రచారంలో పాల్గొంటామని పది మంది మహిళలు కోరారని, పార్టీపై ప్రజల్లో ఉన్న అభిమానానికి ఇది నిదర్శనమని చెప్పారు. నెల్లూరు ఎంపీగా విజయసాయిరెడ్డి, రూరల్ ఎమ్మెల్యేగా ఆదాల ప్రభాకర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని తెలిపారు. పార్టీ డివిజన్ ఇన్‌చార్జి నన్నపురెడ్డి సుబ్బారెడ్డి, కలువాయి ప్రభాకర్‌రెడ్డి, చల్లా మస్తాన్‌రెడ్డి, రంగారెడ్డి, సతీష్, బాబు, కరిముల్లా, గంగిరెడ్డి, రామ్‌సింగ్, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే చర్యలు



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న వెంకటరమణ

నెల్లూరు(బారకాసు): బహిరంగ ప్రదేశాల్లో చెత్తను వేస్తే కఠిన చర్యలు తప్పవని ఎంహెచ్‌ఓ వెంకటరమణ స్పష్టం చేశారు. పరమేశ్వరినగర్, వాకర్స్ రోడ్డు తదితర ప్రాంతాల్లో నిర్వహిస్తున్న పారిశుధ్య పనులను మంగళవారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. వ్యాపార, వాణిజ్య ప్రాంగణాల్లో చెత్త బుట్టలను తప్పక ఉంచాలని, వీటిపై నగరపాలక సంస్థ కేటాయించిన లోగో స్టిక్కర్లను అతికించాలని సూచించారు. కాలువల్లో ప్లాస్టిక్ వ్యర్థాలను వేయడంతో నీటి ప్రవాహానికి అడ్డంకులు ఏర్పడుతున్నాయని, చెత్త సేకరణ వాహనాలకు మాత్రమే అందించాలని చెప్పారు. అనంతరం ఫాగింగ్, మందు పిచికారీ, కాలువల్లో పూడిక తీత పనులను పర్యవేక్షించారు. ప్రధాన రోడ్లపై వాహనదారులకు ఇబ్బందిగా మారిన పశువులపై వాటి యజమానులు బాధ్యత వహించకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పరమేశ్వరినగర్‌లో సంచరిస్తున్న ఆవులను కల్లూరుపల్లిలోని గోశాలకు ప్రత్యేక వాహనాల ద్వారా తరలించారు. గోశాలకు తరలించాక వీటి సంరక్షణ బాధ్యతలను నగర పాలక సంస్థ పర్యవేక్షిస్తుందని తెలిపారు.

నేత్రదానం



సుధాకర్ (ఫైల్)

నెల్లూరు(అర్బన్): దర్గామిట్టలోని పోలీస్ కాలనీకి చెందిన అద్దంకి సుధాకర్ (68) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. ఈ క్రమంలో ఆయన నేత్రాలను కుటుంబసభ్యుల అంగీకారంతో ప్రభుత్వ పెద్దాస్పత్రి ఐ డొనేషన్ కౌన్సెలర్ బాలాజీసింగ్, ఎల్వీ ప్రసాద్ ఐ ఆస్పత్రి టెక్నీషియన్ లాలేష్ సేకరించారు. అనంతరం కుటుంబసభ్యులకు నేత్రదాన సర్టిఫికెట్‌ను అందజేశారు. నేత్రదానం చేసేందుకు 99481 64781, 93471 11033 నంబర్లను సంప్రదించాలని జిల్లా అంధత్వ నివారణాధికారి డాక్టర్ శర్వాణి కోరారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



నెల్లూరు(బారకాసు): దర్గామిట్టలోని నగరపాలక సంస్థ ప్రాథమికోన్నత పాఠశాలలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న ప్రవీణ్‌కుమార్ ప్రమాదంలో మృతి చెందిన నేపథ్యంలో ఆయన భార్యకు ఆర్థిక సాయాన్ని బీటీఏ ఆధ్వర్యంలో అందజేశారు. కార్పొరేషన్ కార్యాలయ ప్రాంగణంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ భవనంలో కమిషనర్ వికాస్ మర్మత్ సమక్షంలో రూ.1.76 లక్షల మొత్తాన్ని చెక్కు రూపంలో బీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు పల్లం వేణుగోపాల్ అందజేశారు. బీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టేటి రమేష్, అసోసియేట్ ప్రెసిడెంట్ వేణుగోపాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మనోజ్‌కుమార్, కార్యదర్శి రఘు, జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణయ్య, రవి, మల్లికార్జున, చెన్నకేశవ, కృష్ణ, రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి విశేష పూజలు



విశేషాలంకారంలో ఆంజనేయస్వామి

పొదలకూరు : పట్టణంలోని మారుతీనగర్‌లో ఉన్న వీర అభయాంజనేయస్వామికి అర్చకులు మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం ఆకుపూజ, అభిషేకాలు, తిరిగి సాయంత్రం స్వామికి పూజలు, పల్లకిసేవ గావించారు.

రథోత్సవ ఏర్పాట్లపై సమీక్ష



నెల్లూరు(బారకాసు): నగరంలో కొలువైన తల్పగిరి రంగనాథస్వామి రథోత్సవాన్ని పురస్కరించుకొని పారిశుధ్య పనులను ఎంహెచ్‌ఓ వెంకటరమణ మంగళవారం పర్యవేక్షించారు. దేవస్థానం వద్ద శానిటేషన్ అధికారులతో సమీక్షించిన అనంతరం ఆయన మాట్లాడారు. రథోత్సవానికి హాజరయ్యే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలను ప్రణాళికబద్ధంగా చేపట్టాలని సూచించారు. తాగు నీటి సౌకర్యం, వీధుల్లో పరిశుభ్రత, వివిధ ప్రాంతాల్లో డస్ట్ బిన్లను ఏర్పాటు చేయాలని సూచించారు. నిషేధిత ప్లాస్టిక్‌ను వినియోగించకుండా భక్తులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు.

రంగడికి పట్టువస్త్రాల సమర్పణ



నెల్లూరు(బృందావనం): నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని స్వామివారికి పట్టువస్త్రాలను టీటీడీ ఆధ్వర్యంలో మంగళవారం సమర్పించారు. టీటీడీ డిప్యూటీ ఈఓ లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికబద్ధంగా శిక్షణ తరగతులు



మాట్లాడుతున్న వికాస్ మర్మత్

నెల్లూరు(బారకాసు): ఎన్నికల శిక్షణ తరగతులను ప్రణాళికబద్ధంగా నిర్వహించాలని నెల్లూరు నగర నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కమిషనర్ వికాస్ మర్మత్ ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ భవనంలో మాస్టర్ ట్రెయినర్లతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డీకేడబ్ల్యూ కళాశాలలో ఈ నెల 28, 30న నిర్వహించనున్న ఎన్నికల శిక్షణలో భాగంగా పోలింగ్.. సహాయక పోలింగ్ అధికారుల విధి విధానాలను వివరించారు. అన్ని అంశాలపై పోలింగ్ అధికారులకు సమగ్ర శిక్షణ ఇవ్వాలని చెప్పారు. నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ శర్మద, ఏఆర్వో దేవీకుమారి, ఎంహెచ్‌ఓ వెంకటరమణ, ఈఈ చంద్రయ్య, ఏఈఆర్వో వెంకటేశ్వరరావు, టీపీఆర్వో ప్రసాద్, మేనేజర్ ఇనాయతుల్లా, మాధవి తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా

- ఇద్దరికి గాయాలు

వెంకటాచలం : ఆటో బోల్తా పడి ఇద్దరు వ్యక్తులు గాయపడిన ఘటన మండలంలోని కసుమూరు సమీపంలో మంగళవారం జరిగింది. నెల్లూరు నగరంలోని జాకీర్‌హుస్సేన్ నగర్ ప్రాంతానికి చెందిన కరిముల్లా, ఆసిఫ్ పని నిమిత్తం ఆటోలో కసుమూరుకు వచ్చారు. తిరిగి నెల్లూరుకు వెళ్తుండగా పాలిచెర్లపాడు మలుపురోడ్డు వద్ద ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కరిముల్లా, ఆసిఫ్‌లకు స్వల్పగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): తల్పగిరి రంగనాథుడి రథోత్సవాన్ని పురస్కరించుకొని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా బుధవారం ఉండదని నెల్లూరు టౌన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సోమశేఖర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గోపురంవీధి, రంగనాయకులపేట, బుజ్జమ్మ రేవు, ఇసుకడొంక, గురుతోట తదితర ప్రాంతాల్లో ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం రెండు వరకు సరఫరా ఉండదని చెప్పారు.

1వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఉదయగిరి: మండలంలోని ప్రైవేట్ పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి ఉచిత ప్రవేశానికి అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈఓ షేక్ మస్తాన్‌వలి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంటున్న పిల్లలు, బీసీ, మైనార్టీ, ఓసీ వర్గాల పిల్లలకు విద్యాహక్కు చట్టం ప్రకారం 25 శాతం ఉచితంగా విద్యను అందించాల్సి ఉందన్నారు. ప్రవేశాలు పొందేందుకు ఈ నెల 31వ తేదీలోపు ఆన్‌లైన్ ద్వారా దాఖలు చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వేరుశనగ నూర్పిళ్లు ప్రారంభం



వేరుశనగ కాయల నూర్పిళ్లు చేస్తున్న కూలీలు

ముత్తుకూరు : ముత్తుకూరు మండలంలో రబీ సీజన్ కింద వేసిన వేరుశనగ పంట కోతలు ప్రారంభమయ్యాయి. పలు గ్రామాల్లో వ్యవసాయ కూలీలు, యంత్రాల ద్వారా నూర్పిళ్లు జరుగుతున్నాయి. ముత్తుకూరు, నారికేళ్లపల్లి, పంటపాళెం, ఈపూరు, దొరువులపాళెం, మామిడిపూడి, బ్రహ్మదేవి, పిడతాపోలూరు, నేలటూరు తదితర పంచాయతీల్లో ఈ సీజన్‌లో 520 ఎకరాల్లో శనగ సాగు చేశారు. ప్రస్తుతం నారికేళపల్లి, ముత్తుకూరు, పంటపాళెం, ఈపూరు పంచాయతీల్లో కోతలు ప్రారంభమయ్యాయి. శనగ నూర్పిళ్ల ఫలితంగా గ్రామాల్లో సందడి నెలకొంది. ఎకరాకు 35 నుంచి 40 కిలోల శనగ కాయల దిగుబడి ఉంటోందని రైతులు చెబుతున్నారు. అయితే కాయలు ఎండబెట్టుకునే దశలో ఉండడం వల్ల అమ్మకాలు ప్రారంభం కాలేదు.

ఘన నివాళి



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): వక్ఫ్‌బోర్డు జిల్లా మాజీ చైర్మన్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత మున్వర్ మృతి చెందడంతో ఆయన పార్థీవదేహానికి పార్టీ నెల్లూరు పార్లమెంట్, నెల్లూరు నగర అభ్యర్థులు వేణుంబాక విజయసాయిరెడ్డి, ఖలీల్ అహ్మద్, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మంగళవారం నివాళులర్పించారు. జెండావీధిలోని ఆయన నివాసానికి వెళ్లి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

హోమియోలో అన్ని వ్యాధులకు చికిత్స



రోగిని పరీక్షిస్తున్న డాక్టర్ శిరీష

మనుబోలు : అన్నిరకాల వ్యాధులకు హోమియోలో చికిత్స ఉందని స్థానిక ప్రభుత్వ హోమియో డాక్టర్ శిరీష అన్నారు. మనుబోలు చంద్రమౌళీనగర్ గిరిజన కాలనీలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పలువురు రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దీర్ఘకాలిక వ్యాధులను గుర్తించడంతో పాటు నివారణ మార్గాలు హోమియో వైద్యంలో ఉన్నాయన్నారు. బీపీ, షుగర్, పైల్స్ వంటి వాటికి వైద్యం అందించడంతో పాటు ఉచితంగా మందులు కూడా అందజేస్తామని తెలియజేశారు. ఈ వైద్య శిబిరంలో ల్యాబ్ టెక్నీషియన్ నజీమా, హోమియో వైద్య సిబ్బంది సుప్రియ, రాజన్, అంగన్‌వాడీ సుగుణమ్మ ఉన్నారు.

ఆక్రమణలపై ఫిర్యాదు

ఆత్మకూరు: ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని జలవనరుల శాఖ (ఇరిగేషన్)కు చెందిన స్థలాల్లో ప్రార్థన మందిరాలను కట్టే ప్రయత్నాలు జరుగుతుండడంతో వారిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఇరిగేషన్‌శాఖ అధికారులు మంగళవారం తెలిపారు. గత వారం పట్టణంలోని సర్వే నంబర్లు 898, 900లో నిర్మాణాలు చేస్తుండగా ఇరిగేషన్ శాఖ అధికారులు వాటిని అడ్డుకుని ప్రభుత్వ స్థలాలుగా బోర్డులు ఏర్పాటు చేశారు. అయితే మంగళవారం ఆ స్థలాల్లో బోర్డులు తొలగించి మళ్లీ నిర్మాణ ప్రయత్నాలు చేస్తుండడంతో ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

చీరల పంపిణీ



నెల్లూరు(బృందావనం): నగరంలోని పాత మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో గల పట్టణ నిరాశ్రయుల కేంద్రంలో పేదలకు చీరలు తదితరాలను ఎస్కేబీ చారిటబుల్ ట్రస్ట్, ఇందిరాగాంధీ సేవా సదన్ ఆధ్వర్యంలో మంగళవారం పంపిణీ చేశారు. ట్రస్ట్ నిర్వాహకులు అల్లావుద్దీన్, సుధీర్, హఫీజ్, ఆదినారాయణ, బాబు, రవి, ప్రతాప్, నాగూర్‌బీ తదితరులు పాల్గొన్నారు.

సోమరాజుపల్లిలో పశువైద్య శిబిరం

ఇందుకూరుపేట: పశుసంవర్ధక శాఖ, స్వర్ణభారత్ ట్రస్ట్, మండవ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో మండలంలోని సోమరాజుపల్లిలో మంగళవారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పశు సంవర్ధక శాఖ ఏడీ మురళీకృష్ణ ఆధ్వర్యంలో పశువులకు పరీక్షలు చేసి వాటికి సంబంధించిన మందులను పాడి రైతులకు ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో మైపాడు పశువైద్యాధికారి అస్లామ్ అక్తర్, మండవ ఫౌండేషన్ డాక్టర్ వి.శ్రీనివాసులు, ఎల్ఎస్ఏ రాజేశ్వరి, రైతు భరోసా పశువైద్య సహాయకులు శేఖర్, జగదీష్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.